

అగ్గి ఎలా రాజుకుంది?

- విద్యుత్ సౌకర్యం లేదు.. కిటికీలు, షట్టర్లు మూసే ఉన్నాయి
- పెబ్బేరు మార్కెటింగ్ గోదాంలో ప్రమాదంపై అనుమానాలు
- 12.80 లక్షల గన్నీ బ్యాగుల దగ్ధం.. ఇంకా ఆరని మంటలు
- యాసంగిలో ధాన్యం సేకరణకు ఇబ్బందులు..
- గోదాంలో 70 వేల బస్తాల సీఎంఆర్ ధాన్యం నిల్వ.. 30 శాతం డ్యామేజీ



మార్కెటింగ్ శాఖ గోదాంలో రాజుకుంటున్న మంటలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): వనపర్తి జిల్లా పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న మార్కెటింగ్ శాఖ గోదాంలో సోమవారం జరిగిన భారీ అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరావడం లేదు. ఈ గోదాంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడం, కిటికీలు, షట్టర్లు కూడా మూసే ఉండటం, అగ్నిమాపక వాహనాల ద్వారా మంటలు ఆర్పడానికి గోడలకు కన్నాలు పెట్టాల్సి రావడంతో అసలు లోపల అగ్గి ఎలా రాజుకుంది?.. ఇందులో ఎవరి ప్రమేయమైనా ఉందా?.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రూ.కోట్ల విలువ చేసే ధాన్యం, గన్నీ బ్యాగులు నిల్వ ఉన్నచోట కనీసం భద్రతా చర్యలు తీసుకోలేకపోవడం వల్లే ఈ సమస్య ఎదురైందని చెప్పొచ్చు. భారీగా ప్రమాదం జరిగి.. వేల బస్తాల ధాన్యం నిల్వ ఉండటంతో మంటలు పూర్తిగా ఆరిపోలేదు. బస్తాలు ఒక్కోటి తీస్తూ, మంటలను ఆర్పుతున్నారు. సాధారణంగా వ్యవసాయ, మార్కెటింగ్, సివిల్ సప్లయ్ గోదాంల దగ్గర సెక్యూరిటీ ఉండాలి. గోదాంలలో రూ.కోట్ల విలువ చేసే ధాన్యం ఉంటుంది కాబట్టి పర్యవేక్షణ కచ్చితంగా అవసరం. కానీ పెబ్బేరు గోదాం వద్ద ఎలాంటి పర్యవేక్షణ లేదు. సీసీ కెమెరాల సదుపాయం కూడా లేదు. ఇక్కడ యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు తెచ్చిన గన్నీ బ్యాగులతోపాటు రెండు రైస్ మిల్లులకు చెందిన ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నాయి. వేసవి లేదా ఇతర సమయాల్లో ఇళ్లు, కంపెనీలు, ఇంజీర్ ప్రాంతాల్లో అయితే ఎక్కువగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంతో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది. ఆరుబయట ప్రాంతాల్లో మాత్రం ఎక్కువగా మానవ తప్పిదాల వల్ల జరుగుతాయి. కానీ ఇక్కడ రెండు రకాలుగా ప్రమాదం జరిగేందుకు అవకాశం లేదు. గోదాం లోపల విద్యుత్ సౌకర్యం లేదు. పోని ఎవరైనా ధూమపానం చేసి అక్కడ బీడీ లేదా సిగరెట్ పీకలు పడేసి ఉంటారంటే కిటికీలు, షట్టర్లు కూడా పూర్తిగా మూసేసి ఉన్నాయి. బస్తాల లోడింగ్, అన్‌లోడింగ్‌కు కూడా హమాలీలు వచ్చిన దాఖలాలు కూడా లేవు. మరి అలాంటి పరిస్థితుల్లో మంటలు ఎలా వ్యాపించాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఈ ఘటనకు ఎవరినీ కూడా బాధ్యులుగా చేసే అవకాశాలు కనిపించడం లేదు. రూ.కోట్ల విలువ చేసే గోదాం వద్ద భద్రత, సీసీ కెమెరాలు, నిరంతర పర్యవేక్షణ చూసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణంగా చెప్పొచ్చు. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఉన్నతాధికారులు ఎలా నిగ్గు తేల్చుతారో వేచి చూడాలి.

70 వేల బస్తాల ధాన్యం నిల్వ..

రాష్ట్ర ప్రభుత్వం ఏటా పౌరసరఫరాల సంస్థ ద్వారా ధాన్యం సేకరణ చేసి.. సీఎంఆర్ కోసం రైస్ మిల్లర్లకు అప్పగిస్తుంది. మిల్లుల్లో నిర్మించుకున్న గోదాముల్లో వారు ధాన్యం నిల్వ చేసుకోవాలి. అయితే ధాన్యం సేకరణ సామర్థ్యం పెరగడంతోపాటు ఏ సీజన్ ధాన్యాన్ని ఆ సీజన్‌లో మర ఆడించి.. ఇవ్వకపోవడం వల్ల ధాన్యం పేరుకుపోతోంది. దాంతో వచ్చే సీజన్ ధాన్యాన్ని ఎక్కడ స్టోర్ చేయాలో తెలియక మిల్లుల యజమానులు ప్రభుత్వ గోదాముల్లో నిల్వ ఉంచుకుంటున్నారు. ఇందుకుగాను ఆ శాఖకు అద్దె రూపంలో చెల్లిస్తున్నారు. అయినప్పటికీ ఏ సీజన్‌లో కూడా నిర్దేశిత సమయానికి మిల్లర్లు బియ్యం ఇవ్వడం లేదు. ఇటీవలి కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లపై ఒత్తిడి పెంచడంతో పాటు, ఒక సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని నోటిపై చేసి టెండర్లు వేయడం ద్వారా మిల్లర్ల వద్ద ధాన్యం నిల్వల్లో తేడాలను గమనించింది. అదే విధంగా మిల్లర్లు ఎఫ్‌సీఐకి కాకుండా సివిల్ సప్లయ్‌కే సీఎంఆర్ బియ్యం ఎక్కువ ఇచ్చారు. ఎఫ్‌సీఐ నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తుండటం.. సివిల్ సప్లయ్ అయితే అంతగా పట్టింపు లేకపోవడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. సాధారణంగా కంపెనీల్లో మంటలు చెలరేగితే వెంటనే అందరికీ ఇన్సూరెన్స్ కోసం అంటించారనే అనుమానాలు వ్యక్తమవుతాయి. అలాగే గోదాంలో మంటలు వచ్చినప్పుడు సీఎంఆర్ ఒత్తిడిని తప్పించుకునేందుకు ఎవరైనా ఇలాంటి పనిచేశారా? అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ గోదాంలో రెండు రైస్ మిల్లులకు చెందిన 70 వేల బస్తాలు నిల్వ ఉన్నాయి. అందులో 30 శాతం వరకు డ్యామేజీ అయినట్లు తెలుస్తోంది. అయితే అవి ఏ సీజన్‌వో తెలియడం లేదు. 1, 3 కంపార్ట్‌మెంట్లలో సీఎంఆర్ ధాన్యం ఉండగా.. మధ్యలో ఉన్న కంపార్ట్‌మెంట్‌లో గన్నీబ్యాగులు నిల్వ ఉంచారు. గన్నీ బ్యాగుల వద్ద మంటలు చెలరేగి.. మిగతా కంపార్ట్‌మెంట్లకు వ్యాపించినట్లు తెలుస్తోంది. కచ్చితంగా ఇది ఎవరో కావాలని చేసిన పనిగానే పలువురు అభిప్రాయపడుతున్నారు.



ప్రమాదంపై పెబ్బేరు మార్కెట్ యార్డులో విచారణ చేస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ధాన్యం సేకరణకు ధోకా లేనట్లేనా..


ప్రభుత్వ ధాన్యం సేకరణ పాలసీ ప్రకారం రైతులు పండించిన చివరి గింజ వరకు కొనాల్సి ఉంటుంది. కానీ రైస్ మిల్లర్ల అలసత్వం వల్ల ప్రభుత్వం తెచ్చిన రుణాలు తడిసి మోపెడవుతుండటంతో రెండు, మూడు సీజన్లుగా ధాన్యం తక్కువగా కొనుగోలు చేస్తోందని చెప్పొచ్చు. యాసంగిలో ఈ ఏడాది రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకోగా.. లక్ష మెట్రిక్ టన్నులు కూడా సేకరణ అవుతుందో లేదోనని పౌరసరఫరాల శాఖ వర్గాలు అంటున్నాయి. వనపర్తి జిల్లా పరిధిలో ధాన్యం సేకరణకు 40 లక్షల గన్నీ బ్యాగులు అవసరం కాగా.. పెబ్బేరు మార్కెటింగ్ శాఖ గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 12.85 లక్షల గన్నీ బ్యాగులు దగ్ధమయ్యాయని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి అంతకంటే ఎక్కువగానే దగ్ధం అయినట్లు తెలుస్తోంది. ఇవి కాకుండా ఇంకా 32 లక్షల గన్నీ బ్యాగులు నిల్వ ఉన్నట్లు చెబుతున్నా.. నిజంగా అంత మొత్తంలో బ్యాగులు నిల్వ ఉన్నాయా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. ధాన్యం సేకరణ అంచనాల ప్రకారం ఇప్పుడు నిల్వ ఉన్న గన్నీ బ్యాగులు యాసంగికి సరిపోతాయనే అంచనాలు ఉన్నాయి. ఇవి సరిపోతే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. ఒక వేళ అధికారులు చెప్పినన్ని బ్యాగులు లేకుంటే కచ్చితంగా ఇబ్బంది పడతారు. ప్రస్తుతం దగ్ధమైన గన్నీ బ్యాగుల విలువ దాదాపు రూ.9 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

గేట్ల మరమ్మతుల్లో జాప్యం



జూరాల ప్రాజెక్టు గేట్లు

- జూరాల ప్రాజెక్టు వద్ద గాంటీ క్రేన్‌లో మరోసారి సాంకేతిక సమస్య
- రెండేళ్లయినా పూర్తి కాని క్రస్టు గేట్ల పనులు
- 36, 37 గేట్ల నుంచి నీరు లీక్
- పది వేల ఎకరాలకు అందని వాటర్



క్రస్టు గేటు

ధరూరు, ఏప్రిల్ 2: జోగుళాంబ గద్వాల జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాల క్రస్ట్ గేట్ల మరమ్మతులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. 2022 సంవత్సరంలో హైదరాబాద్‌కు చెందిన స్వప్న కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులను దక్కించుకోగా.. రెండేళ్లుగా మొత్తం 62 గేట్లలో 24 మాత్రమే మరమ్మతులు పూర్తి చేశారు. ప్రాజెక్టు వద్ద ఉన్న గాంటీ క్రేన్‌లో సాంకేతిక సమస్య పేరుతో పనులను పూర్తి చేయడం లేదు. క్రస్ట్ గేట్ల ఎగువ నుంచి మోటార్లకు, ఇతర చానల్స్‌కు మాత్రమే పెయింటింగ్ పనులు పూర్తయ్యాయి. మరమ్మతులు పూర్తి కాకపోవడంతో పది వేల ఎకరాలకు నీరందడం లేదు.

గాంటీ క్రేన్ సమస్య పేరుతో..

ప్రాజెక్టు 36, 37 గేట్ల నుంచి నీరు లీకేజీ అయ్యి, వృథాగా పోతోంది. ఇలా నీరు వృథాగా పోవడంతో దాదాపు పది వేల ఎకరాలకు నీరందడం లేదు. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం తొమ్మిది టీఎంసీలు కాగా, ఎగువ నుంచి వరద వచ్చినప్పుడు కేవలం ఏడు టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంచుతున్నారు. దీంతో సాగు, తాగు నీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గాంటీ క్రేన్ సమస్య పేరుతో రెండేళ్లుగా కాంట్రాక్టర్ క్రస్ట్ గేట్ల మరమ్మతులు పూర్తి చేయడం లేదని, మరమ్మతులు పూర్తయితే జలాశయంలో తొమ్మిది టీఎంసీల మేర నీటిని నిల్వ ఉంచొచ్చని అధికారులు చెబుతున్నారు.

వరదలు వచ్చినప్పుడే హడావిడి

మహారాష్ట్ర, కర్ణాటకలలో ప్రాజెక్టులు నిండిన తర్వాత ఒక్కరోజులోనే జూరాల జలాశయం పూర్తిగా నిండే అవకాశం ఉంటుంది. దాంతో వరద వస్తున్న సమయంలో జలాశయంలో 1.50 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చూసుకుని మిగతాది కిందికి వదులుతారు. అదే క్రస్ట్ గేట్ల మరమ్మతులు పూర్తయితే ఏడు టీఎంసీలు నిల్వ ఉంచుకునే అవకాశం ఉంటుంది. ప్రాజెక్టులో నాలుగు నుంచి ఐదు టీఎంసీల నీరు నిల్వ ఉన్నప్పుడు 36, 37 గేట్ల నుంచి నీరు లీక్ అవుతుంది. జూరాలకు వరద మొదలైతే నీటి ఒత్తిడి కారణంగా మరమ్మతులను నిలిపివేసే అవకాశం ఉంది. అయితే వరద సమయంలో గాంటీ క్రేన్ ద్వారా గేట్ల మరమ్మతులు చేయవచ్చని అధికారులు చెబుతున్నా.. కాంట్రాక్టర్ మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. జూలై 15వ తేదీ నాటికి జలాశయానికి వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. అప్పటి వరకు గేట్ల మరమ్మతులు పూర్తి చేస్తారా? లేదా? అనేది సందేహం నెలకొంది.

వరద వచ్చేలోపు పూర్తయ్యేనా?

క్రస్ట్ గేట్ల మరమ్మతులు, పెయింట్ వేసేందుకు రూ.11.45 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో కొన్ని పనులను మినహాయించి రూ.9.45 కోట్లతో హైదరాబాద్‌కు చెందిన స్వప్న కంపెనీ పనులను దక్కించుకుంది. 2021 నవంబరులో పనులు మొదలు పెట్టాల్సి ఉండగా ఒప్పందాలు ఆలస్యం కావడంతో 2022లో మొదలు పెట్టారు. అయితే అదే సంవత్సరం జూన్‌లో వరదలు రావడంతో పనులను నిలిపివేశారు. మళ్లీ 2024 ఫిబ్రవరిలో పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ తిరిగి గత నెల మార్చిలో గాంటీ క్రేన్‌లో సమస్యల కారణంగా నిలిపేశారు. మళ్లీ ఏప్రిల్‌లో పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు. 14 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికే 19 నెలలు అయినా పూర్తి కావడం లేదని అధికారులు అంటున్నారు. ఈ సారైనా వరదలు వచ్చేలోపే గాంటీ క్రేన్‌లో సమస్యలను పరిష్కరించి క్రస్ట్ గేట్ల మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నారు.

గాంటీ క్రేన్ సమస్య వాస్తవమే..

క్రస్ట్ గేట్ల మరమ్మతులకు ఉపయోగించే గాంటీ క్రేన్‌లో సాంకేతిక సమస్యల కారణంగా పనులు నిలిచిపోయాయి. అదనంగా మరో గ్రాంటీ క్రేన్ ఉంటే సమస్య ఉండేది కాదు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. సమస్యలను పరిష్కరించేందుకు కొద్ది రోజుల్లో నిపుణులు రానున్నారు. గ్రాంటీ క్రేన్‌లో మరమ్మతులు పూర్తి చేసి, వరదలు వచ్చేలోపు క్రస్ట్ గేట్ల మరమ్మతులు పూర్తి చేస్తాం.

- జుబేర్ అహ్మద్, ఈఈ, జూరాల



సాంకేతిక లోపంతో నిలిచిపోయి గాంటీ క్రేన్

నల్లమలమల

- అడవిలో వరుస అగ్ని ప్రమాదాలు
- ఈ ఏడాది ఇప్పటికే ఐదు ఘటనలు
- మంటలకు అల్లాడుతున్న వన్య ప్రాణులు
- కాలిబూడిదవుతున్న ఔషధ మొక్కలు



నల్లమలలో ఎగిసి పడుతున్న మంటలను ఆర్పుతున్న అటవీ సిబ్బంది(ఫైల్)

అచ్చంపేట ఏప్రిల్ 2: వేసవి రాకతో నల్లమల అభయారణ్యం అగ్నికి ఆహుతవుతోంది. దహించి వేసే అగ్నికీలల్లో వన్య ప్రాణులు, పక్షులు, మొక్కలు, చెట్లు కాలిబుడిదవుతున్నాయి. దీనికి కారణం మనుషులా? లేక ఇంకేదైనా నష్టం మాత్రం వాటిల్లుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో కోర్ ఏరియా 2,166.37 చదరపు కిలో మీటర్లు ఉండగా, బఫర్ ఏరియా 445.02 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. మొత్తం 2,611.4 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో 29 రకాల జంతువులు, 310 రకాల పక్షులు, కీటకాలు, 500లకు పైగా ఔషధ మొక్కలు ఉన్నాయి.

వేసవిలో వరుస ప్రమాదాలు

వేసవిలో చోటు చేసుకుంటున్న అగ్ని ప్రమాదాలతో నల్లమల మాడిపోతోంది. ఇప్పటివరకు జరిగిన చాలా అగ్ని ప్రమాదాల్లో ఎక్కువగా మానవ తప్పిదాలే కారణమని తెలుస్తోంది. ఈ ప్రమాదాల్లో ఔషధ మొక్కలతో పాటు సర్పాలు, వివిధ రకా కీటకాలు, పక్షులు, నేలపై పారాడే ఎన్నో రకాల జంతువులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. చాలా వరకు జంతువులు, పక్షులు ముంచుకొచ్చే ఆపదలను పసిగట్టి తప్పించుకుంటున్నా.. పెద్ద ఎత్తున సంభవించే అగ్ని ప్రమాదాలతో సహజ సిద్ధమైన ప్రకృతి సంపదను కోల్పోతున్నాం. అటవీ ప్రాంతం గుండా ఉండే జాతీయ రహదారి వెంట నిత్యం భక్తులు, పర్యాటకులు శ్రీశైలం వెళ్తుంటారు. దాంతో రోడ్డు ఎల్లప్పుడూ రద్దీగా ఉటుఉంది. ఈ క్రమంలో అటవీ మార్గంలో ఆగి సేదతీరుతున్న క్రమంలో సిగరెట్లు, బీడీలు తాగి, చల్లార్చకుండా పడేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దాంతో పాటు ఇప్ప పువ్వును ఏరుకునేందుకు చెట్ల కింద ఉన్న గడ్డిని చెంచులు కాల్చి వేసే క్రమంలో కూడా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రమాదాల నివారణపై నల్లమలలో ప్రయాణించే భక్తులకు, పర్యాటకులకు, అడవిలో జీవించే చెంచులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నా మాత్రం అగడం లేదు.

ఈ ఏడాది జరిగిన ప్రమాదాలివి..

మన్ననూర్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో అమ్రాబాద్, మన్ననూరు, దోమలపెంట రేంజ్‌ల వారీగా ఈ ఏడాది జనవరి చివరి వారం నుంచి నేటి వరకు ఐదు అగ్ని ప్రమాదాలు జరిగాయి. కొమ్మన్ పెంట వద్ద ప్రమాదం జరిగి అక్కడి నుంచి కొల్లంపెంట దాకా 50 హెక్టార్లలో అడవి దగ్ధమైంది. తర్వాత తాటిగుండాల నుంచి వజ్రాల మడుగు దాకా 220 హెకార్లు, రాంపూర్ నుంచి పుల్లాయపల్లి దాకా 50 హెక్టార్లు, కిన్నెర గుండం, ఎల్లాయకుంట, తుమ్మగుంట కాలువ, నర్లిపడేలు ప్రాంతాల్లో 100 హెక్టార్లు, తవిశిపెంట నుంచి నీలారాం బండల వరకు 50 హెక్టార్లు అగ్ని ప్రమాదాల్లో అడవి కాలి బూడిదైంది.

అడవులను కాపాడే బాధ్యత అందరిది

అడవులను కాపాడే బాధ్యత అందరిది. వాటిని కాపాడితేనే అవి మనల్ని కాపాడుతాయి. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు జంతువులు, పక్షులు పసిగట్టి, తప్పించుకుంటాయి. ఒకేసారి పెద్ద ఎత్తున మంటలు విస్తరిస్తే తప్ప.. ప్రమాదాల బారిన పడవు.. మేము చాలా వరకు అగ్ని ప్రమాదాలను అరికడుతున్నాం. నల్లమలలో పర్యటించే ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరిస్తే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోవు.

- ఈశ్వర్, ఎఫ్ఆర్వో, మన్ననూర్



మంటలు చెలరేగి కమ్ముకున్న పొగ(ఫైల్)



ప్రమాదంలో కాలిబూడిదైన అడవి

వలస కూలీ ఆత్మహత్య



మృతురాలి తల్లితో వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం

కల్వకుర్తి, ఏప్రిల్ 2 : వలస కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. మంగళవారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం వలస కూలీ మృతికి సంబంధించిన వివరాలను సేకరించారు. ఎస్సై జి.మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని సౌత్‌సోలాపూర్‌కు చెందిన సాగర్‌చౌహాన్, అతని భార్య మనస్వీసాగర్ చౌహాన్(22) ఐదేళ్ల కుమారుడితో కలిసి కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లిలోని రమేష్ వద్ద పశువుల షెడ్డులో పని చేయడానికి మార్చి 28న వలస వచ్చారు. భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవతో మనస్తాపానికి గురైన మనస్వీసాగర్‌చౌహాన్ ఆదివారం సాయంత్రం పొలంలో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన భర్త ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు మృతి చెందింది. భార్య మృతి చెందిన విషయాన్ని భర్త మృతురాలి తల్లికి, కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో మంగళవారం వారు ఆసుపత్రికి చేరుకున్నారు. కూతురు మృతదేహాన్ని చూసి తల్లి, కుటుంబీకులు విలపించారు. మృతురాలి తల్లి సీతాబలిసిందే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు బంధువులకు అప్పజెప్పారు.

కబ్జా నిరూపించాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2: తాను 720 ఎకరాలు కబ్జా చేసినట్లు కాంగ్రెస్ నాయకుడు వంశీచంద్‌రెడ్డి ఆరోపిస్తున్నారని, ఎక్కడ కబ్జా చేశానో నిరూపించాలని, లేదంటే గడియారం చౌరస్తాలో ముక్కు నేలకు రాయాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సర్దార్ సర్వాయ్ పాపన్న వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని పాపన్న విగ్రహానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. చిన్న జాగ కోసం అన్నదమ్ములు కొట్టుకుంటున్నారని, అలాంటిది 700 ఎకరాలు కబ్జా చేస్తే ఎవరైనా ఊరుకుంటారా అని ప్రశ్నించారు. అన్ని అనుమతులతో తాను ఇల్లు కట్టుకుంటే.. ఇల్లు గుంజుకున్నారని మాట్లాడారని, ఇల్లు కట్టుకుంటే కళ్ల మంట, కారు కొంటే కళ్ల మంట, దుస్తులేసుకుంటే కళ్లమంట అని, మరి బహుజనులు ఇల్లు లేకుండా గుడిసెల్లోనే ఉండాలా? స్లిప్పర్‌లు వేసుకుని తిరగాలా? అంటూ ప్రశ్నించారు. సర్దార్ సర్వాయ్ పాపన్న కోసం తాను ఏమీ చేయలేదని వంశీచంద్ మాట్లాడుతున్నారని, జిల్లాలో ఆయన విగ్రహం పెట్టింది తానేనని చెప్పారు. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై విగ్రహ ఏర్పాటు కోసం రూ.3 కోట్లు మంజూరు చేయించానని, సర్దార్ సర్వాయ్ పాపన్న జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని తాను ఇచ్చిన లెటర్ కారణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఏది మాట్లాడినా ప్రజలు నమ్ముతారని, తనపై విమర్శలు చేస్తే ఓట్లు పడతాయని ఆయన అనుకుంటే అది ఆయన మూర్ఖత్వమే అవుతుందన్నారు. గత ఎన్నికల్లో తన ఓటమి కోసం కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై పని చేశాయన్నారు. ఈ రెండు పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోడ్గల్‌యాదవ్, రాజేశ్వర్‌గౌడ్, బస్వరాజ్, సుధాశ్రీ, కట్టా రవికిషన్‌రెడ్డి, తాటిగణేష్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్ పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయ్ పాపన్న విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

ఈతకు వెళ్లి బాలిక మృతి

ధరూరు, ఏప్రిల్ 2 : సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన ఓ బాలిక నీటి గుంతలో మునిగి మృతి చెందింది. ఈ విషాద సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం గార్లపాడులో మంగళవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... గ్రామానికి చెందిన కురువ నాగేంద్ర, జమ్ములమ్మ దంపతుల కుమార్తె మమత (11) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. మంగళవారం సరదాగా ఐదారుగురు స్నేహితులతో కలిసి గ్రామ శివారులోని పొలంలో ఉన్న నీటిగుంతలో ఈతకు వెళ్లింది. ఈత రాకపోవడంతో ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లను నడుముకు కట్టుకొని నీళ్లలో దిగింది. కానీ బాటిళ్లు ఊడిపోవడంతో మునిగిపోయింది. ఈ విషయాన్ని గమనించని స్నేహితులు ఇంటికి వెళ్లిపోయారు. బాలిక ఇంటికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు నీటి గుంతలో గాలించగా, బాలిక మృతదేహం లభ్యమయ్యింది. గురువారం బాలిక సోదరుడి వివాహం ఉంది. దాంతో విషాదం నెలకొంది. ఈ విషయంపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

సీఎంఆర్ డెలివరీ త్వరగా పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 2 : వానాకాలం (ఖరీఫ్ సీజన్) 2023-24కు సంబంధించి సీఎంఆర్ డెలివరి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావుతో కలిసి రైస్ మిల్లర్లు, సివిల్ సప్లయ్ అధికారులతో సమావేశమయ్యారు. 42113.868 మెట్రిక్ టన్నుల రైస్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. 40-50 ఏసీకేల ప్రకారం మిగతా టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ లేదు


ధన్వాడలో డీకే అరుణను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ధన్వాడ/దామరగిద్ద ఏప్రిల్ 2 : తెలంగాణలో బీఆర్ఎస్ లేదు.. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ లేదని ఇప్పుడున్నదంతా మోదీ నాయకత్వంలోని బీజేపీ పార్టీ మాత్రమేనని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మండల కేంద్రమైన ధన్వాడలో ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మరికల్, ధన్వాడ మండలాల బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇక రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఇక ఆ పార్టీలో ఎవ్వరు ఉండే పరిస్థితి లేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదని విమర్శించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 8 లక్షల ఎకరాలకు నీళ్లు అందించవచ్చన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డికి జూరాల నుంచి నీళ్లు తీసుకునేలా డీపీఆర్ తీసుకొస్తే, అందుకు ప్రాజెక్టు కావల్సిన నిధులు ఎలా తీసుకురావలో మాకు తెలుసు అని సవాల్ విసిరారు. పాలమూరు పూర్తి అయితే మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు సస్యశామలం అవుతాయన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభంజనం మొదలైందని, అత్యధిక ఎంపీ సీట్లు బీజేపీ గెలవబోతుందన్నారు. అంతకుముందు దామరగిద్ద మండల కేంద్రంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన కొనసాగిన మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. అబద్ధపు మోసపూరితమైన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి మే 13న జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రతంగ్‌పాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు, సత్యయాదవ్, లక్ష్మీ శ్యాంసుదర్‌గౌడ్, నర్సన్ గౌడ్, సుంకు ఉమేష్‌కుమార్ గుప్తా, కుర్వ మల్లయ్య, తిరుపతిరెడ్డి, రఘురామయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత: కేసు నమోదు

మిడ్జిల్(మహబూబ్‌నగర్), ఏప్రిల్ 2 : మండలంలోని కొత్తూరు, మిడ్జిల్ గ్రామాల మధ్యన ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ మంగళవారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బెల్టు షాపులపై ఆకస్మిక దాడులు

మిడ్జిల్, ఏప్రిల్ 2 : మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామంతో పాటు పలు గ్రామాలలో బెల్టు షాపులపై మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు. మసిగుండ్లపల్లి గ్రామంలోని ఈశ్వరయ్య కిరాణం దుకాణంలో రూ. 4వేల విలువచేసే మద్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు. మండలంలోని అక్రమంగా మద్యం విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

అగ్ని ప్రమాదంపై విచారణ

- గన్నీ బ్యాగుల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు
- ప్రమాదానికి బాధ్యులెవరైనా సరే శిక్ష తప్పదు
- ఎమ్మెల్యే మేఘారెడ్డి
- అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, ఏప్రిల్ 2: వనపర్తి జిల్లా పెబ్బేరు మార్కెట్‌యార్డు గోదాములో జరిగిన అగ్ని ప్రమాదం దురదృష్టకర సంఘటన అని దీనిపై విచారణ ప్రారంభమైందని అదనపు కలెక్టర్ ఆశీస్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్‌యార్డులోని కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. అంతకు ముందు స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదం ఆకస్మికంగా సంబవించిందా, కావాలని చేశారా అనే దానిపై విచారణ చేస్తున్నామని, విచారణలో కారణాలు వెల్లడైనా తరువాత కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గోదాంలో ఉన్న గన్నీ బస్తాలను లారీలో మరో చోటికి తరలిస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలులో గన్నీ బ్యాగుల విషయంలో రైతులు ఏలాంటి ఆందోళన వద్దని ఉన్నతాధికారులతో మాట్లాడి గన్నీ బ్యాగులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి గోదాములు నిర్మించిందని, గోదాముల భద్రత విషయంపై ప్రభుత్వం సమీక్ష జరిపి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఈ ఘటనతోనే ప్రభుత్వం మేల్కొని అన్ని గోదాముల వద్ద సీసీ కెమెరాలు, భద్రత ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అక్కమ్మ, అశ్విని, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, పెబ్బేరు మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ కరుణశ్రీ, కర్రెస్వామి ఉన్నారు.

విచారణ కొనసాగుతుంది

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

అగ్ని ప్రమాద ఘటనపై పూర్తి వివరాలు సేకరించేందుకు విచారణ ప్రారంభించామన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన పెబ్బేరు మార్కెట్‌యార్డు కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఘటన జరిగిన గోదాములో స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. ఆఫీసులో పని చేసే ప్రతీ ఒక్కరిని ప్రమాదం జరిగిన విషయంపై ఆరా తీశారు. అనంతరం ఘటన స్థలం వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. పెబ్బేరు మార్కెట్‌యార్డు గోదాంలో ఉన్న 12.80 లక్షల గన్నీ బ్యాగులు పూర్తిగా దగ్ధమయ్యాయని వ్యవసాయ శాఖ రీజినల్ జాయింగ్ డైరెక్టర్ ఇఫ్తేకార్‌నదీమ్ తెలిపారు. మంగళవారం ప్రమాద ఘటనపై ఆయన విచారణ చేసేందుకు పెబ్బేరు మార్కెట్‌యార్డును సందర్శించారు. ఆ గోదాంలో మొత్తం 3 కంపార్ట్‌మెంట్లు ఉన్నాయని, 2 కంపార్ట్‌మెంట్‌లలో గన్నీ బ్యాగులు నిల్వ ఉంచారని అన్నారు. 1,3 కంపార్ట్‌మెంట్‌లో ప్రైవేటు వ్యక్తులకు చెందిన 84 వేల సంచుల వరి ధాన్యం ఉందని, అది 20-30 శాతం మాత్రమే కాలిందని తెలిపారు. ఆ ధాన్యాన్ని ఇతర చోటకు తరలిస్తున్నట్లు చెప్పారు. పూర్తి విచారణ తరువాత అన్ని వివరాలు వెల్లడిస్తామని ఆయన మీడియాకు తెలిపారు. ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్ లక్ష్మి, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు మంగళవారం సాయంత్రం వరకు సంఘటన స్థలంలోనే ఉండి పరిస్థితిని సమీక్షించారు. ఫైర్ సిబ్బంది రెండు రోజుల పాటు శ్రమించారు.


కాలి బూడిదైన గన్నీ బ్యాగులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

మునిసిపల్ అవిశ్వాసంలో నాటకీయ పరిణామాలు

- విప్ జారీ చేసిన సీపీఎం రాష్ట్ర కమిటీ
- విప్‌ను ధిక్కరిస్తే కౌన్సిలర్లపై అనర్హత వేటు
- రేపు మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

అమరచింత, ఏప్రిల్ 2 : అమరచింత మునిసిపల్ అవిశ్వాసంపై నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అమరచింత మునిసిపల్ అవిశ్వాస పరీక్షకు ముందే విపక్ష పార్టీలలో వారి కలయికలపై అంతర్మథనం మొదలైందని చెప్పవచ్చు. గత నెల చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస నోటీసు ఇచ్చిన సమయంలో బీఆర్ఎస్ ఇద్దరు, సీపీఎం ఒకరు, బీజేపీ ఇద్దరు, సీపీఐ ఒకరు మొత్తం ఆరు మంది కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు కలెక్టర్‌కు అందజేశారు. ప్రస్తుతం నాటకీయ పరిణామాల మధ్య వారి ఐక్యత కొరవడుతోందని చెప్పవచ్చు. ముఖ్యంగా కమ్యూనిస్టులు బీజేపీ కౌన్సిలర్లు కలవడం పట్ల పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

విప్ జారీ చేసిన సీపీఎం రాష్ట్ర కమిటీ

మునిసిపల్ చట్టం ప్రకారం సీపీఎం రాష్ట్ర కమిటీ మంగళవారం విప్ జారీచేసింది. అమరచింత మునిసిపాలిటీలో ఇద్దరు కౌన్సిలర్లు ఉన్న సీపీఎం నాయకులు అప్పట్లో బీఆర్ఎస్ అధిష్ఠానంతో సయోధ్య కుదుర్చుకొని సీపీఎం వైస్ చైర్మన్ పదవిని పొందింది. ప్రస్తుతం సీపీఎం ఒక కౌన్సిలర్ పార్టీకి వ్యతిరేకంగా బీజేపీతో కలిసి వెళ్తున్న విషయాన్ని సీపీఎం అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఇప్పటికే సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ తమ పార్టీ కౌన్సిలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. బీజేపీతో కలిసి అవిశ్వాసానికి వెళ్లే ప్రసక్తే లేదని ఆ పార్టీ నాయకులు పేర్కొంటారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విప్ జారీ చేశారు. సీపీఎం నాయకులు హుటాహుటిన ఖమ్మంలో ఉన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వద్దకు వెళ్లి విప్ పత్రాన్ని రాత్రికి రాత్రి తీసుకొచ్చి మంగళవారం కలెక్టర్‌కు అందించారు. దీంతో విప్ ధిక్కరిస్తే సీపీఎం కౌన్సిలర్లకు అనర్హత వేటుపడే అవకాశం ఉంది.



అమరచింత మునిసిపల్ కార్యాలయం

విప్ జారీకి బీఆర్ఎస్ ముమ్మర ప్రయత్నం

సొంత పార్టీ చైర్మన్‌పైనే బీఆర్ఎస్ సభ్యులు అవిశ్వాసానికి వెళ్లడంపై ఆ పార్టీ అధిష్ఠానం గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ద్వారా విప్ జారీ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కవిత అరెస్టు, పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై కేటీఆర్ బిజీబిజీగా ఉండడంతో అందు బాటులోకి రాలేదని తెలిసింది. రేపటి వరకు గడువు ఉండడంతో బీఆర్ఎస్ నాయకులు విప్ జారీ కోసం ప్రయత్నిస్తున్నారు.

అంతర్మథనంలో బీజేపీ

అవిశ్వాసానికి ముందే బీజేపీ, కమ్యూనిస్టుల కలయికపై ఆయా పార్టీలలో అంతర్మథనం మొదలైందని చెప్పవచ్చు. ఇప్పటికే వారితో కలిసి ఉన్న సీపీఎం బీజేపీతో కలిసి అవిశ్వాసానికి వెళ్లేదే లేదని వారి అధిష్ఠానం గట్టిగా చెప్పడంతో పాటు విప్ జారీ చేసింది. దీంతో బీజేపీ అధిష్ఠానం కమ్యూనిస్టులతో కలిసి అవిశ్వాసానికి వెళ్తే భవిష్యత్తు ఎన్నికల్లో ప్రజలకు ఎలాంటి సందేశం ఇవ్వాల్సి వస్తుందని అంతర్మథనంలో పడినట్లు తెలుస్తుంది.

ఉత్కంఠంగా మారనున్న అవిశ్వాస పరీక్ష

ఈ నెల 4వ తేదీన అమరచింత మునిసిపల్ కార్యాలయంలో జరిగే అవిశ్వాస పరీక్ష ఉత్కంఠంగా మారనుంది. మునిసిపల్‌లో పది మంది కౌన్సిలర్లు ఉండగా అవిశ్వాసానికి అనుకూలంగా ఆరు మంది కౌన్సిలర్లు సీపీఎం ఒకరు, సీపీఐ ఒకరు బీజేపీ ఇద్దరు బీఆర్ఎస్ ఇద్దరు కలిసి గత నెల కలెక్టర్‌కు నోటీసులు అందజేశారు. తీరా సీపీఎం అధిష్ఠానం విప్ జారీ చేయడంతో ఆ ఒక్క కౌన్సిలర్ పక్కకు తప్పుకున్నట్లు అయింది. ప్రస్తుతం ఐదు మంది సభ్యులు మాత్రమే అవిశ్వాసానికి అనుకూలంగా ఉన్నట్లు తెలిసింది. మునిసిపల్ యాక్ట్ ప్రకారం పది మంది కౌన్సిలర్లకు గాను 7మంది సభ్యులు అవిశ్వాస పరీక్షకు హాజరైతే కోరం ఉన్నట్లు పరిగణిస్తారు. సీపీఎంకు చెందిన ఇద్దరు సభ్యులు కలుస్తేనే అవిశ్వాసం నెగ్గినట్లు అవుతుంది. సీపీఎం సభ్యులు తప్పుకుంటే ఐదుగురితో అవిశ్వాసం వీగిపోతుంది.

తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో పటిష్ట బందోబస్తు

- ఇరురాష్ట్రాల పోలీసులు సమన్వయంతో పని చేయాలి
- బళ్లారి రేంజ్ ఐజీ లోకేష్ కుమార్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు బందోబస్తు పరంగా ఇరు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో ముందుకెళ్లాలని బళ్లారి రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బీఎస్ లోకేష్ కుమార్ అన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని జోగుళాంబ డీఐజీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జోగుళాంబ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్, గద్వాల ఎస్పీ రితిరాజ్, నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్, రాయిచూర్ ఎస్పీ నిఖిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజీ, డీఐజీలు లోక్‌సభ ఎన్నికల బందోబస్తుపై మాట్లాడారు. అంతర్రాష్ట్ర సరిహద్దుకావడంతో సరిహద్దులో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

మద్యం, నగదు రవాణాపై నిఘా ఏర్పాటు చేయాలని, అంతరాష్ట్ర, అంతర్ జిల్లా పోలీస్ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలలో 24/7 చెక్ పోస్టులను ఏర్పాటుచేసి పకడ్బందీ తనిఖీలు చేపట్టేలా అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. మద్యం నగదుతో పాటు గంజాయి, ఇరత మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడికోసం ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సమాచారం అందించుకోవాలని తెలిపారు. సరిహద్దులో హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, పోలీస్ అధికారులు వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులు వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టులలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఐజీ బీఎస్ లోకేష్, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

బాలికపై అత్యాచారం, కేసు నమోదు

బల్మూరు, ఏప్రిల్ 2 : బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన గతనెల 24వ తేదీన చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(14)ను అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్(24) గతనెల 24వ తేదీన ఆటోలో తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలికను గతేడాది కూడా అత్యాచారం చేయడంతో అప్పట్లో కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గ్రామ పెద్దలు కొందరు పంచాయితీ పెట్టి కేసు లేకుండా చేశారు. తిరిగి గతనెల ఇంటివద్దనున్న బాలికను అదే ఆటోడ్రైవర్ అత్యాచారం చేసి ఆటోలో ఇంటి వద్ద దింపి వెళ్లిపోయాడు. మంగళవారం బాలిక నాయనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలిక ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతోంది.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు

బల్మూరు, ఏప్రిల్ 2 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం లక్ష్మీపల్లి గ్రామంలో ఓ యువకుడిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండాల గణేష్‌తో పాటు, అతని మిత్రుడు సంఘముని, రమేష్‌లు కలిసి ఈనెల ఒకటో తేదీన గ్రామంలోని చౌరస్తాలో తమ పూర్వ విద్యార్థుల ఫొటోలను షేర్ చేసుకుంటున్నారు. వారికి దూరంగా ఉన్న అదే గ్రామానికి చెందిన దండు లింగస్వామి, అతని తమ్ముడు దండు రాజు వీరిపై కర్రలతో దాడి చేశారు. దాడిలో గణేష్ తల భాగంలో తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో చుట్టుపక్కల వారు గమనించి వారిని విడిపించి, ఆసుపత్రికి తరలించారు. ఘటనపై మంగళవారం బాధితుడు గణేష్ ఫిర్యాదు మేరకు లింగస్వామి, రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో నెమలి మృతి

మానవపాడు, ఏప్రిల్ 2 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని చెన్నిపాడు గ్రామంలో మంగళవారం రోడ్డుపైకి వచ్చిన నెమలిని ఊరకుక్కలు వెంటాడి దాడి చేశాయి. గమనించిన గ్రామస్థులు కుక్కలను తరిమేసి నెమలిని కాపాడారు. ఎస్ఐ చంద్రకాంత్‌కు సమాచారం అందించి పోలీసులకు అప్పగించారు. వారు దాన్ని పశువైద్యశాలకు తరలించి చికిత్స చేస్తుండగానే మృతి చెందడంతో ఫారెస్ట్ కానిస్టేబుల్ కీర్తికి అప్పగించారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

బాలానగర్, ఏప్రిల్ 2 : మండల కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ. 50,600 నదును పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపాజి తెలిపారు. పుట్టపర్తి జిల్లా నల్లమాడకు చెందిన సయ్యద్ అమన్‌వుల్లా నగదును తీసుక వెళ్తుండగా, అందుకు సంబంధించిన రసీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం

- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

పాన్‌గల్, ఏప్రిల్ 2: ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న మోదీ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామస్థులు ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల బీజేపీ ప్రభుత్వ పాలనలో రాజకీయాలకు విలువలు లేకుండా చేశారని విమర్శించారు. ఎన్నికల సంఘం, ఈడీ, సీబీఐ మోదీ చేతిలో కీలుబొమ్మగా మారాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యవాదులు ఈ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి మల్లురవి గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అవేజ్ అహ్మద్, మహబూబ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు అజ్మత్ అలీ, పాన్‌గల్ సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రాముయాదవ్, మాణిక్యంరెడ్డి, బ్రహ్మయ్య ఉన్నారు.


ఒబేదుల్లా కొత్వాల్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మద్యం, నగదు పట్టివేత

నవాబ్‌పేట, ఏప్రిల్ 2 : మండలంలోని లోకిరేవు గ్రామానికి చెందిన దుబ్బ సత్యయ్య అక్రమంగా నిల్వ ఉంచిన 4.7లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో తెలిపారు. అనుమతి లేకుండా మద్యం విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు మండలంలోని కొల్లూర్ గ్రామానికి చెందిన శాబాద్ మహేష్ అనే యువకుడు కొంత కాలంగా వైన్స్‌లో పని చేస్తున్నాడు. ఇతను మంగళవారం రూ. 63 వేల నగదు తరలిస్తుండగా ఎస్ఐ పట్టుకుని వివరాలు అడుగగా ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


నగదు స్వాధీనం చేసుకున్న ఎస్ఐ అభిషేక్ రెడ్డి

రూ.1,03,715 నగదు పట్టివేత

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 2 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఎస్పీ యోగేశ్ గౌతమ్ ఆదేశాల మేరకు పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసులు మంగళవారం మండలంలోని జలాల్‌పూర్ చెక్‌పోస్టు దగ్గర తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో నారాయణపేట నుంచి యాద్గీర్‌కు వెళ్తున్న ఎండీ సోఫీశర్మాత్ వద్ద రూ.1,03,715 నగదును పట్టుకుని గ్రీవియన్స్ కమిటీకి అప్పజెప్పినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లరాదని, ఒక వేళ తీసుకెళ్తే ఆ నగదుకు సంబంధించిన ధ్రువపత్రాలు ఉండాలని ఎస్ఐ తెలిపారు.

బొలెరో వాహనం బోల్తా

ధరూరు, ఏప్రిల్ 2 : టమోటాల లోడ్‌తో వెళుతున్న బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు గ్రామ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధరూరు మండల కేంద్రానికి చెందిన బొలెరో వాహనం, స్థానిక రైతుల నుంచి సేకరించిన టమోటాల లోడుతో తెల్లవారుజామున ఐదు గంటలకు గద్వాల మార్కెట్‌కు బయలు దేరింది. దాదాపు 5.20 గంటల సమయంలో ధరూరు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు దాటిన తర్వాత వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ గోవిందుకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వాహనాల తనిఖీలో రూ.53 వేలు పట్టివేత


వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై

ఉప్పునుంతల, ఏప్రిల్ 2 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం తిర్మలాపూర్ స్టేజీ సమీపంలో ఎస్సై లెనిన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీలో పెబ్బేటి పరుశరాములు అనే వ్యక్తి పెద్దకొత్తపల్లి గ్రామంలో మామిడి తోట లీజ్ డబ్బులు రూ.53 వేల నగదును తీసుకెళ్తుండగా ఎస్సై పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి, గ్రీవెన్స్ కమిటీకి అప్పజెప్పినట్లు ఎస్సై తెలిపారు.

సకాలంలో ఉపాధి కూలి అందించాలి

- అడిషనల్ డీఆర్‌డీవో, జడ్పీ డిప్యూటీ సీఈవో ముసాయిదా బేగం



ఉపాధి కూలి పనులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీవో ముసాయిదా బేగం

గండీడ్, ఏప్రిల్ 2 : ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించి సమయానికి కూలి డబ్బులు అందించాలని ఏపీడీ, జడ్పీడిప్యూటీ సీఈవో ముసాయిదా బేగం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి, మహమ్మదాబాద్ మండలం దేశాయిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి ఏపీవో, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలకు పని దినాలు పెంచి గ్రామానికి 200 మందిని పెంచాలని సూచించారు. ప్రతీ గ్రామ కార్యదర్శి కూలీలకు నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. కూలీలకు డబ్బులు సమయానికి అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీపాద్, ఎంపీడీవో దేవన్న, అంబుడ్స్ మెన్ సంతోష్ కుమార్, ఏపీఓ హరిచంద్రుడు, టీఏలు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం సభ్యులు

రాజాపూర్, ఏప్రిల్ 2 : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆనంద్‌గౌడ్, నారాయణగౌడ్, కృష్ణయ్యగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, మల్లేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, చంద్రకాంత్‌గౌడ్, ఉదయ్‌గౌడ్, రాజేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, మహేష్‌గౌడ్, శ్రీనుగౌడ్, ఆయా గ్రామాల గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో గంప జాతర

హన్వాడ, ఏప్రిల్ 2 : మండలంలోని నాయినోనిపల్లి, హన్వాడ గ్రామాలలో మంగళవారం ప్రజలు గంప జాతరను ఘనంగా జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం ఉగాది పండుగకు ముందు ప్రజలు ఈ జాతరను జరుపుకుంటారు. పొలాలకు వెళ్లి చెట్ల కింది వంటలు చేసుకున్నారు. సరదాగా కాలక్షేపం చేశారు. మాంసాహార వంటలు చేసుకొని కుటుంబ సమేతంగా ఆరగించారు.

కొండాపూర్ గ్రామంలో..

నవాబ్‌పేట : మండలంలోని కొండాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామస్థులు గంపజాతర జరుపుకున్నారు. ఇంటివద్ద పిండివంటలు చేసుకొని పిల్లాపాపలు, బంధువులతో పంటపొలాలవద్దకు చేరుకుని వెంట తీసుకువచ్చిన వంటలను సామూహిక భోజనాలు చేసుకుని ఇంటికి తిరిగి వచ్చారు. అందరు కలిసి ఆటాపాటలతో జరుపుకున్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ అడ్డాకుల మండల కమిటీ ఏర్పాటు

అడ్డాకుల, ఏప్రిల్ 2 : మండలంలో ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణంలో ఎస్‌ఎఫ్‌ఐ మహాసభను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మండలంలో ఒక పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాలతో పాటుగా ఒక గురుకుల పాఠశాలను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఎంఈవోల పోస్టులను వెంటనే భర్తీ చేయా లని కోరారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌ల ను వెంటనే విడుదల చేయాలని కోరారు. అంతకు ముందు 11మందితో ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా నరేష్, కార్యదర్శిగా రత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత

భూత్పూర్, ఏప్రిల్ 2 : మండలంలోని పోతులమడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వాటర్ ఫిల్టర్‌ను అందించారు. మంగళవారం పోతులమడుగు గ్రామాన్ని శిక్షణ ఫౌండేషన్ వారు సందర్శించి పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడారు. చాలా కాలంగా పాఠశాలకు శుద్ధి చేసిన నీరు పిల్లలకు అందడం లేదని ఉపాధ్యాయులు పలు మార్లు గ్రామంలో ఉన్న యువకులకు సమాచారం ఇచ్చారు. వారు శిక్షణ ఫౌండేషన్ వారి దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి విద్యార్థులకు కోసం వాటర్ ఫిల్టర్ మిషన్‌ను అందించారు. ఉపాధ్యాయులు శిక్షణ ఫౌండేషన్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో శిక్షణ ఫౌండేషన్ ఉమ్మడి పాలమూరు జిల్లా సమన్వయ కర్త చిరంజీవి, భూత్పూర్, అడ్డాకుల మండలాల ఇన్‌చార్జ్ హనుమంతు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రేణుకాదేవి, చంద్రశేఖర్, రాఘవేందర్, గీత, నిహారిక, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

మిడ్జిల్, ఏప్రిల్ 2 : జడ్చర్ల పట్టణంలోని అనురాగిణి ఆశ్రమంలో విద్యార్థులకు విద్యా సామగ్రిని మ్యాన్‌కైండ్ ఫార్మా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో అందజేశారు. స్కూల్ బ్యాగ్స్, వాటర్‌బాటిళ్లు, టిఫిన్‌బాక్సులతో పాటు విద్యా సామగ్రిని అందజేశారు. అనాథ పిల్లలను ఆదుకునేందుకు మానవత్వంతో ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని ఆశ్రమ అధ్యక్షుడు మంచన విఠలయ్య తెలిపారు. విద్యార్థులు ప్రణాళికతో చదివి ముందుకు సాగాలని వివరించారు. కార్యక్రమంలో మ్యాన్‌కైండ్‌ఫార్మా మేనేజర్ రాజ్‌కుమార్, రిప్రజెంట్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, రాఘవేందర్, కరకాల కృష్ణారెడ్డి, సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, విద్యార్థులు, ఆశ్రమ సిబ్బంది ఉన్నారు.

మజీద్‌లకు పండ్లు అందజేత

మిడ్జిల్(మహబూబ్‌నగర్), ఏప్రిల్ 2 : రంజాన్ మాసం అయినందున జడ్చర్ల పట్టణంతో పాటు మండంలోని వివిధ గ్రామాల్లోని మజీదులకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పండ్లను అందజేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి సహకారంతో ఇఫ్తార్ విందుకుగాను పండ్లను బీఆర్ఎస్ నాయకులు పాలాది రామ్మోహన్, నాగిరెడ్డి, శ్రీకాంత్, ఇంతియాజ్ తదితరులు అందజేశారు. మొదట పట్టణంలోని గఫురియామజీద్ నుంచి పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఖీద్, దానిష్, అలీ తాహెర్ మసియుద్దీన్, దర్శన్, నిజాం, సుభాన్, వీరేష్, తాహెర్, మోహిస్, ఇబ్రహీం, ఫారుఖ్, అబ్దుల్లా సోయల్ ఉన్నారు.

భూత్పూర్‌లో సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీ



సోనాసీడ్స్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

భూత్పూర్, ఏప్రిల్ 2 : మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సీడ్స్ విత్తన ప్రాసెసింగ్ యూనిట్లను జిల్లా కేంద్రం నుంచి వచ్చిన వ్యవసాయశాఖ విజిలెన్స్ బృందం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న వసంత సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్, అదే విధంగా గోపీకృష్ణ, సాయితేజ, సికోప్స్, మవసాన్ ప్రాసెసింగ్ యూనిట్లను అధికారుల బృందం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్లల్లో ఉన్న బేసిక్ రిజిస్టర్స్, స్టాక్ రిజిస్టర్లు, లైసెన్స్‌లు, టీసీలు, డీసీలు, విత్తనాలు నిల్వ ఉన్న స్టాక్ వివరాలు, ఇతర రిజిస్టర్లను తనిఖీ బృందం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రాసెసింగ్ యూనిట్ యజమానులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విత్తన చట్టం ప్రకారం కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలని అధికారుల బృందం సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఏడీఏ యశ్వంతరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం సాంకేతిక సలహాదారులు వినోద్‌కుమార్, ఏవోలు శ్యామ్‌యాదవ్, రాజేందర్‌అగర్వాల్, మురళీధర్ పాల్గొన్నారు.

మీ ముఖాల్లో చిరునవ్వే మాకు కావాల్సింది

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఇక నుంచి మీకు తైబజారు వేధింపులు ఉండవు

- మార్కెట్‌లో వీధి వ్యాపారులకు పలకరింపు



రైతుబజార్, వీధుల్లో చిరువ్యాపారులను పలకరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్

పాలమూరు, ఏప్రిల్ 2 : తైబజార్ రద్దుతో రైతులు, చిరువ్యాపారులు, వీధుల్లో సరుకులు అమ్ముకునే వారి ముఖాల్లో చిరునవ్వులు మాకు కావాల్సిందని అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో వీధుల్లో అమ్ముకునే చిరు వ్యాపారులకు తైబజారు వసూలును ఎమ్మెల్యే యెన్నం రద్దు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం జిల్లా కేంద్రంలోని 45వ వార్డులోని రైతుబజార్, వీధుల్లో చిరువ్యాపారులను మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పలకరించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి తైబజార్ రద్దు చేయటం సంతోషమేనా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులను ఈ స్థితిలో చూడటం తనకు సంతోషంగా ఉందన్నారు. మునిసిపల్ కౌన్సిల్‌లో చట్టబద్ధంగా తీర్మానం చేసి తైబజార్ రద్దు చేశామన్నారు. చిరువ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మునిసిపాలిటీకి వచ్చే ఆదాయం కంటే పేదవారి ఆత్మగౌరవం మాకు ముఖ్యమన్నారు. తైబజార్ పేరుతో వీధి వ్యాపారులు దౌర్జన్యాలకు, వేధింపులకు, అవమానాలకు గురికావటంతో బాధపడటం నిన్నటి మాట అని, నేటినుంచి స్వేచ్ఛగా వ్యాపారం చేసుకుని జీవించడమే అన్నారు. వచ్చే ఏడాదిలోపు మోడల్ మార్కెట్‌గా రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నాన్‌వెజ్ వ్యాపారులు తీవ్రమైన ఎండకు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి వ్యాపారులు తీసుకొచ్చారు. నాన్‌వెజ్ వ్యాపారులకు తాత్కాలికంగా షెడ్ ఏర్పాటు చేయాలని వార్డు కౌన్సిలర్ చిన్నను ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పీ వెంకటేష్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ సాయిబాబా, సీజే బెనహర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, కౌన్సిలర్ చిన్న, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ, జగదీష్, వెంకటలక్ష్మి, అబ్దుల్‌హక్, రాజుగౌడ్, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బహుజనుల అభ్యున్నతికి సర్దార్ సర్వాయి పాపన్న కృషి : ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ : బహుజనుల అభ్యున్నతి కోసం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఎన్నో పోరాటాలు చేశారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పీడిత వర్గాల పక్షాన నిలబడుతూ గోల్కొండ కోటను జయించిన వీరుడని కొనియాడారు. మంగళవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన విగ్రహానికి మునిసిపల్ చైర్మన్, ఉమ్మడి పాలమూరు గౌడ సంఘం అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. సర్వాయి పాపన్న విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామిగౌడ్, సాయిలుగౌడ్, యాదగిరిగౌడ్, రాజుగౌడ్, పురుషోత్తంగౌడ్, జీఎల్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కుమార్‌గౌడ్, రమేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

- చిన్న పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- వైద్యారోగ్య సిబ్బందిని ఆదేశించిన కలెక్టర్ రవి నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి. రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 2 : పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు పాటించేలా గ్రామాలలో అవగాహన కల్పించాలని కలెక్టర్ జి. రవి నాయక్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్తీ దవాఖాన, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సరిపోయే విధంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉంచాలని, గ్రామాల్లో ప్రతీ ఆశా వర్కర్ దగ్గర 300 ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉంచాలని, వారు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. అంతేగాకుండా వరి కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బంది పడకుండా నీడకోసం టెంట్, కుర్చీలు, తాగునీరు, ప్రతీ కేంద్రంలో 150 ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రణాళికాబద్ధంగా తాగు నీటి సమస్యను కూడా అధిగమించాలని, అందుకు కావాలిసిన మరమ్మతులను చేపట్టాలని సంబంధిత ఇంజనీర్లను, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బోర్లు లేని ప్రభుత్వ పాఠశాలల్లో నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలపై సమీక్షించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, డీఆర్‌డీవో పి. నర్సింహులు, జడ్పీ సీఈఓ రాఘవేంద్రరావ్, డీఆర్వో కెవి. విరవికుమార్, ఆర్డీఓ నవీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదేళ్లు రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నాం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ - రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 2 : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, వారికి ఏ కష్టం రాకుండా చూసుకున్నామని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కరోనా కష్టకాలంలో కూడా రైతులకు పెట్టుబడి సాయం కింద రైతుబంధు వేశామని, రైతుబీమా అమలుచేసి 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారం లోకి రాగానే రైతు కష్టాలు మొదలయ్యాయని, ఎక్కడ చూసినా పంటలు ఎండిపోయి గొర్రెలను మేపుతున్నారని, ఆత్మహత్యలు జరుగుతున్నాయని విచారం వెలిబుచ్చారు. రైతు సమస్యలపై మంగళవారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ రవినాయక్ గుగులోత్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, రూ.2లక్షల రుణమాఫీ, మద్దతుపై రూ.500 బోనస్ వస్తాయని చెప్పితే నమ్మారని, ఇప్పటి వరకు ఏ హామీ అమలు కాలేదన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తుందని, ఆరవ తేదీన రైతుల పంట పొలాలను సందర్శించే కార్యక్రమాలు చేస్తామన్నారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అలవి కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. పంట కోత దశకు చేరిందని, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుకావాలంటే పార్లమెంట్ ఎన్నికలో వాత పెట్టాలని అన్నారు. ఈ క్యాక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, నాయకులు రాజేశ్వర్‌గౌడ్, గంజి ఎంకన్న, కోరమోని నర్సింహులు, సుదాశ్రీ, కట్టా రవికిషన్‌రెడ్డి, శివరాజు, బాలరాజు, కరుణాకర్‌గౌడ్, మురళీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓటుకు నోటు కేసును మర్చిపోవొద్దు

-బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), ఏప్రిల్ 2 : భారతీయ జనతాపార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణపై ఆరోపణలు చేసేటప్పుడు మీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఓటుకు నోటు కేసును మర్చిపోవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ రెడ్డి, స్పోక్స్‌పర్సన్ కొండా ప్రశాంత్‌రెడ్డిలు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజ లకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలే కాదు, మీ మ్యానిఫెస్టోలో తెలిపిన 420 హామీల అమలుపై దృష్టి పెట్టాలని వారు హితవు పలికారు. పార్లమెంట్ ఎన్నికల నేప థ్యంలో పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డీకే అరుణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. చేతనైతే రాజకీయం గా ఎదుర్కోవాలని, వ్యక్తిగతంగా కాదని హితవు పలికారు. డీకే అరుణను దొరసాని అని సంబోధించడం ముఖ్యమంత్రి స్థాయికి తగదని అన్నారు. పాలమూరు యూనివర్శిటీకి రూ.100 కోట్లు ఇచ్చింది ఎవరో తెలియదా అని ప్రశ్నించారు. ఇకమీదట ఇలాగే జరిగితే ఊరుకునేది లేదని వారు ఘాటుగా హెచ్చరించారు. అంతకు ముందు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్పోక్స్‌పర్సన్‌లుగా మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కె. రాములు, కొండా ప్రశాంత్‌రెడ్డి, బాలవర్ధన్‌గౌడ్, మెట్టుకాడి శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డిలను పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, జిల్లా నాయకులు పాండురంగారెడ్డి, పడాకుల సత్యం, కౌన్సిలర్ అంజయ్య, అసెంబ్లీ కన్వీనర్ పోతుల రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కాపరులకు డిపాజిట్ డబ్బులు ఇవ్వండి : బీజేపీ

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) : గొర్రెల కాపరులు సబ్సిడీ గొర్రెల యూనిట్ల కోసం కట్టిన డిపాజిట్ డబ్బులు తిరిగి వారి ఖాతాల్లో జమ చేయాలని భారతీయ జనతాపార్టీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ నాయకులు కలెక్టర్ జి. రవినాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ రాములు మాట్లాడుతూ 16 వేల మంది గొల్ల కుర్మలు డిపాజిట్ చేయగా కేవలం 1377 మందికి మాత్రమే సబ్సిడీ గొర్రెలను అందించారని, మిగతా వారికి రాలేదని తెలిపారు. త్వరలోనే కాపరుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని కలెక్టర్ చెప్పినట్లు నాయకులు తెలిపారు.

నెల రోజులు పార్టీ కోసం పని చేయాలి

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్) : ప్రతి ఒక్క కార్యకర్త ఈ నెల రోజులు సమయం ఇచ్చి క్షేత్ర స్థాయిలో పార్టీకోసం పనిచేసి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిని గెలిపించుకోవాలని భారతీయ జనతాపార్టీ పార్లమెంట్ ప్రభారి నరేంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాలమూరు పట్టణ శక్తి కేంద్ర ఇన్చార్జీల సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పద్మజారెడ్డి, బాలరాజు, నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, కిష్టు నాయక్, అంజయ్య, కె.రములు, కిషోర్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల పరిరక్షణ బాధ్యత ప్రధానోపాధ్యాయులదే

- డీఈవో ఎ.రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో ఎ.రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 2 : ప్రభుత్వ పాఠశాల పరిరక్షణ బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులదేనని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ సబ్జెక్టుల ఫోరం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి సెలవుల్లో విద్యార్థులను గాలికి వదిలేయకుండా విద్యార్థులకు ప్రతీ రోజు ఏదో ఒక అసైన్మెంట్ ఇచ్చి వారు బోధనవ్యసన కృత్యాలకు దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. సెలవులల్లో విద్యార్థుల ఈతకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని, ఎండలకు తిరగడం వల్ల వడదెబ్బ బారిన పడి ప్రాణాపాయానికి గురవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జీఎంవో బైకాని బాలుయాదవ్, ఎంఎవో దుంకుడు శ్రీనివాస్, ఎంఈవోలు లక్ష్మణ్‌సింగ్, జయశ్రీ, మంజులాదేవి, నాగయ్య, రాజునాయక్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మతం ఆధారంగా పాలన జరగటం దురదృష్టకరం

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

పాలమూరు, ఏప్రిల్ 2 : భారత దేశంలో రాజ్యాంగం ఆధారంగా కాకుండా మతం ఆధారంగా పాలన జరగటం దురదృష్టకరమని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ రక్షణ యాత్ర మంగళవారం జోగుళాంబ నుంచి ప్రారంభమై మహబూబ్‌నగర్‌కు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత దేశంలో రాజ్యాంగానికి విలువ లేకుండా చేయటమే బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దళితులపై అనేక రకాల దాడులు, అవమానాలు, అత్యాచారాలు, హత్యలు, వివక్షకు సంబంధించి దేశంలో లక్షల్లో కేసులు నమోదవటమే అదుకు తార్కాణమన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తానని చెప్పిన కేసీఆర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రజలు మార్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఇదేవిధంగా ప్రధాని మోడి పాలన సాగిస్తే ప్రజలు ఆయననూ మారుస్తారని జోస్యం చెప్పారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకునే బాధ్యత దేశ ప్రజలపై ఉందని రాష్ట్ర కో-ఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి అన్నారు. నాయకులు బైరి రమేష్, పురుషోత్తం, గండీడ్ చిన్న, బ్యాగరి అమరేందర్, వాల్తేటి అంజనేయులు పాల్గొన్నారు.

మృతునికి నివాళి

హన్వాడ, ఏప్రిల్ 2 : మండల కేంద్రమైన హన్వాడకు చెందిన ముడా మాజీ డైరెక్టర్ కొండ బాలయ్య కుమారుడు వెంకటేష్ (32) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్‌లు మంగళవారం హన్వాడకు వచ్చి వెంకటేష్ పార్థివ దేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను వారు ఓదార్చారు. అండగా ఉంటామని బాలయ్యకు భరోసా ఇచ్చారు. సురేందర్‌రెడ్డి, ఎంపీపీ బాలరాజు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొండ లక్ష్మయ్య, కరుణాకర్‌గౌడ్, మహేందర్, కృష్ణయ్యగౌడ్, వడ్ల శేఖర్, చెన్నయ్య, జంబులయ్య పాల్గొని నివాళి అర్పించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిడ్జిల్(మహబూబ్‌నగర్), ఏప్రిల్ 2 : మండలంలోని వేముల గ్రామంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. గ్రామంలోని వర్షాకాలంలో సీసీ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని, గ్రామంలోని అవసరమున్న చోట సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టేందుకు కృషి చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సెక్రటరీ ప్రేమ్‌రాజ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగయ్య మాజీ ఉప సర్పంచ్ మమత జగదీశ్వర్‌రెడ్డి, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, నాయకులు పాషా, శ్రీనివాసులు, జంగయ్యగౌడ్, శివలింగం, కృష్ణారెడ్డి, నరసింహ, రాములు, శ్రీకాంత్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మిడ్జిల్(మహబూబ్‌నగర్), ఏప్రిల్ 2 : గ్రామాలలో రైతులందరూ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఏపీఎం రాందాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని కంచనపల్లి గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాందాస్ గ్రామ రైతులతో కలిసి ప్రారంభించారు. వరి ఏ గ్రేడుకు ధర రూ.2203, బి గ్రేడుకు ధర రూ.2183 ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ ప్రకాష్, వీవోఏ జంగయ్య, వీవో అధ్యక్షురాలు సత్యమ్మ, వీఓవోబీ నర్సమ్మ, రైతులు ఉన్నారు.

అమర్ రాజా బ్యాటరీ పరిశ్రమ పనులు నిలిపివేయాలి

- కలెక్టర్‌కు మహబూబ్‌నగర్ అభివృద్ధి ఫోరం సభ్యుల వినతి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 2 : మహబూబ్ నగర్ మునిసిపాలిటీ నాలుగవ వార్డు ఎదిర, దివిటిపల్లి గ్రామాల్లో ప్రమాదకరమైన లిథియం బ్యాటరీ పరిశ్రమ పనులను తక్షణమే ఆపి వేయాలని మహబూబ్ నగర్ అభివృద్ధి ఫోరం సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రమాదకర చర్య తీసుకుందని పేర్కొన్నారు. పర్యావరణం, నీటి ప్రాంత కాలుష్యానికి వ్యతిరే కంగా తయారీ కేంద్ర ఏర్పాటు చేయడం వల్ల మహబూబ్‌నగర్ చుట్టుపక్కల 50 కిలో మీటర్ల పరిధిలో సుమారు 10 లక్షల జనాభాకు తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి సారంగి వినయకుమార్, ఉపాధ్యక్షుడు పటేల్ వెంకటేశ్, కార్యదర్శి ముసాంగి శ్రీధర్ బాబు, కోశాధికారి పాపిశెట్టి చంద్రకాంత్ గుప్త, సలహాదారులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'బకాయి బాండ్స్ డబ్బులు చెల్లించాలి'

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 2 : కార్మికులు, విశ్రాంత ఉద్యోగుల 2013 సంవత్సరం పీఆర్సీకి సంబంధించిన బకాయి బాండ్స్ డబ్బులను ఇంకా ఎప్పుడు చెల్లిస్తారని ఆర్టీసి విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికుల 2013 సంవత్సరానికి సంబంధించిన ఆర్పీఎస్ ఎరియర్స్ 50 శాతం బకాయిలకు సంబంధించిన బాండ్లను కార్మికులకు ఇచ్చారని, ఈ చెల్లింపులకు సంబంధించిన రూ.281 కోట్ల చెక్కును ఈ సంవత్సరం ఫిబ్రవరి 10న ముఖ్యమంత్రి సంస్థ ఎండీ సజ్జనార్‌కు అందించి 50 రోజులు దాటిపోయినా ఇంతవరకు ఎందుకు చెల్లించడంలేదని ఆయన ప్రశ్నించారు. వెంటనే బాండ్లకు సంబంధించిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఓబీసీ సెల్ సమావేశానికి మండల కాంగ్రెస్ నాయకులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసి సెల్ సమావేశానికి మండల కాంగ్రెస్ ఓబీసి సెల్ నాయకులు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై జిల్లా నాయకులకు వివరించినట్లు మల్లేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.